క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి క్షీరాభిషేకం



స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

జామి: మండలంలోని కుమరాం కల్యాణనగర్‌లో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం చక్ర స్నానం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి స్నపన తిరుమంజనం



పసుపు అలంకరణలో స్వామివారు

వేపాడ: మండల కేంద్రంలోని కళ్యాణవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి మంత్రోచ్ఛరణ మధ్య శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చోడవరానికి చెందిన పసుమర్తి రాము, అనీల దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలు, అభిషేక సామగ్రి అందజేశారు. పంచామృతాభిషేకం, సుగంధద్రవ్యాభిషేకం, హరిద్రోదకం, నక్షత్రహారతి, దీపహారతి, కర్పూరహారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

శరవేగంగా ఆలయ నిర్మాణ పనులు



నిర్మాణంలో ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయం

మెరకముడిదాం: మండల కేంద్రమైన మెరకముడిదాంలో ఉమాసోమలింగేశ్వరస్వామి ఆలయంను ఆనుకుని నిర్మిస్తున్న శ్రీవల్లీదేవసేన సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన ముదునూరు అశోక్ సౌజన్యంలో గ్రామస్తులు, భక్తులు రూ.20 లక్షల వరకు చందాలు సేకరించి ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ నెలాఖరులోగా పనులన్నీ పూర్తి చేసి జూన్ 3న విగ్రహ ప్రతిష్ఠోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మహిళలకు చీరల పంపిణీ



గిరిజన మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శృంగవరపుకోట: పట్టణంలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, రవికలను ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు శుక్రవారం గిరిజన మహిళలకు పంపిణీ చేశారు. మండలంలోని దారపర్తి గ్రామంలో సుమారు 500 మందికి వీటిని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కె.వి.ఎస్.రామరాజు, జెర్రిపోతుల ఉమ, వాకాడ చినబాబు, మురళి, కర్రి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జాకేరులో మ్యాజిక్ సోక్ పిట్ నిర్మాణం



మోడల్ సోక్ పిట్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామంలో మోడల్‌గా మ్యాజిక్ సోక్ పిట్ నిర్మించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కేఆర్‌వీ పైడిరాజు తెలిపారు. మ్యాజిక్ సోక్ పిట్‌ను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ మ్యాజిక్ సోక్ పిట్ వల్ల మురుగు సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఎస్.కోట మండలం ఆలుగుబిల్లిలో మరో మోడల్ మ్యాజిక్ సోక్ పిట్‌ను నిర్మించినట్లు చెప్పారు. భవిష్యత్‌లో జగనన్న లేఅవుట్లలో అవసరాలకు అనుగుణంగా వీటిని నిర్మించనున్నట్లు చెప్పారు. ఒక్కొక్క మ్యాజిక్ సోక్ పిట్ తయారీకి సుమారు ఐదువేలు రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ఆయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ దేవీ ఉన్నారు.

జగనన్న పాలనలో గ్రామస్వరాజ్యం

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



అవ్వా పింఛన్ సక్రమంగా అందుతోందా.. అంటూ వృద్ధురాలిని అడుగుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: బాపూజీ కలలుకన్న గ్రామస్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో స్పష్టంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామలింగాపురం సచివాలయం పరిధి చీడివలస గ్రామంలో శుక్రవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలోని ప్రతీ గడపకు వెళ్లి నాలుగేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా వారికి చేకూర్చిన లబ్ధిని వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో పాలనను ప్రజలకు చేరువ అయిందన్నారు. నవరత్న పథకాలతో పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా లభిస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని, ఈ ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మీ అందరి ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడు బాబు, జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, ఎంపీటీసీ లెంక వరహాలు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొంతల వెంకటరావు, పార్టీ నాయకులు మేలాస్త్రీ అప్పారావు, పీఎస్ఎన్ పాత్రుడు, రామన్న పాత్రుడు, కొత్తవలస సర్పంచ్ రామస్వామి, యాత కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ దమ్ము రమణ, కొరుపోలు అప్పారావు, జగన్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గాదెలమర్రివలసలో 'గడపగడపకు..'

మెరకముడిదాం: మండలంలోని గాదెలమర్రివలస గ్రామంలో శుక్రవారం జరగాల్సిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం వర్షం కారణంగా శనివారం సాయంత్రానికి వాయిదా వేసినట్టు ఎంపీడీఓ పి.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నందున మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా జగనన్న పాలన

- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- చీడివలసలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు

కొత్తవలస: రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామలింగాపురం సచివాలయం పరిధి చీడివలస గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. అంబేడ్కర్ సారథ్యంలో రూపొందించిన రాజ్యాంగ స్ఫూర్తితోనే సీఎం జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారన్నారు. విద్యతోనే పేదల జీవితాల్లో వెలుగు వస్తుందని గుర్తించి నాడు-నేడు కార్యక్రమం ద్వారా సుమారు రూ.40 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారన్నారు. రామలింగాపురం సచివాలయం పరిధిలో నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.15 కోట్లను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేశామన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులతో పాటు రాయితీపై యంత్రపరికరాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోనూ మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేయాలని, వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలన్నారు. అంతకుముందు గ్రామంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నెక్కలి శ్రీదేవి, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను, ఎంపీటీసీ లెక్క వరహాలు, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొంతల వెంకటరావు, కొత్తవలస సర్పంచ్ మచ్చ రామస్వామి, పార్టీ నాయకులు మేలాస్త్రీ అప్పారావు, పెదిరెడ్ల సూరిబాబు, కొరుపోలు అప్పారావు, గొరపల్లి రవికుమార్, యాత కార్పొరేషన్ డైరెక్టర్ దమ్ము రమణ, జై భీమ్ యూత్ సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీముఖ్యనాయకులు పాల్గొన్నారు.

దీర్ఘకాల సమస్యకు పరిష్కారం



పేరిపిలోని రామమందిరం వీధిలో సిమ్మెంటు కాలువ నిర్మాణ పనులు

చీపురుపల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులకు చిత్తశుద్ధి ఉండాలి. లేకపోతే సుదీర్ఘ కాలంగా ఆ సమస్యలతో అక్కడి ప్రజలు కొట్టుమిట్టాడాల్సిందే. మండలంలోని పేరిపి గ్రామంలో సరిగ్గా అదే జరిగింది. ఆ గ్రామంలో ప్రధాన వీధిగా చెప్పుకునే రామమందిరం వీధిలో కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. 2014 నుంచి 2109 వరకు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీకి చెందిన నాయకుడే సర్పంచ్‌గా పని చేశారు. కానీ ప్రధాన వీధిలో మురుగు సమస్యను పట్టించుకోలేదు. ప్రస్తుత సర్పంచ్ కోరాడ భాగ్యరాజ్ మురుగు సమస్యను ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ దృష్టికి తీసుకురావడంతో ఆయన ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.9.9 లక్షలు మంజూరు చేశారు. దీంతో పేరిపి గ్రామంలోని ప్రధాన వీధిలో 250 మీటర్లు పొడవును రోడ్డుకు ఇరువైపులా సిమ్మెంటు కాలువలు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఎట్టకేలకు మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం



మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం టి.సన్యాసిరాజు ఆధ్వర్యంలో బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించడంతో పాటు చదువుల్లో మరింతగా రాణించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. 45 రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటలు వరకు నిర్వహించే ఈ శిక్షణను విద్యార్థులు, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కోళ్ల వెంకటరమణ, యోగా శిక్షకులు సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్‌పై చర్యలకు సిఫార్సు



విచారణ చేపడుతున్న ఏఎస్‌ఓ అశోక్‌కుమార్

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామానికి రెండు నెలలుగా ఎండీయూ (రేషన్ డోర్‌డెలివరీ) వాహనం రావడం లేదని, రేషన్ సరుకులను డిపో వద్ద తీసుకుంటున్నామని గ్రామస్తుల నుంచి అందిన ఫిర్యాదుపై ఏఎస్ఓ అశోక్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. రేషన్ డిపో డీలర్‌తో పాటు ఎండీయూ వాహన ఆపరేటర్ వద్ద వివరాలు సేకరించారు. ఎండీయూ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అతనిపై క్రమశిక్షణ చర్యలకు ఆర్డీఓకు నివేదిక ఇచ్చినట్లు ఏఎస్ఓ తెలిపారు. ఆయనతో పాటు సీఎస్‌డీటీ ఇందిర, డీలర్ పాపునాయుడు ఉన్నారు.

చింతలపేటలో పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షణ చేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

గుర్ల: మండలంలోని చింతలపేటలో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ భాస్కరరావు పనులను పర్యవేక్షించారు. పారిశుద్ధ్య కార్మికులు వీధి కాలువల్లోని పూడికలు తొలగించి, బ్లీచింగ్ చల్లారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామస్తులంతా సహకరించాలని సర్పంచ్ కోరారు.

గంజాయి తరలింపుపై నిఘా..



ఆటోను తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ సిబ్బంది

కొత్తవలస: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ పి.నరేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తనిఖీలు చేపట్టారు. గంజాయి, ఇతర నిషేధిత మత్తుపదార్థాల రవాణాను పూర్తిగా నిరోధించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగానే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు తనిఖీలు చేస్తున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ చెప్పారు. అరకు-విశాఖ రోడ్డు, గిడిజాల రోడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు తరలిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతుల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధం

గజపతినగరం: మొక్కజొన్న కొనుగోలు, ఎరువులు, విత్తనాలు, యంత్రపరికరాలు తదితర రైతులకు కావాల్సిన అన్ని రకాల అవసరాలను ప్రభుత్వం తీర్చేందుకు సిద్ధంగా ఉందని గ్రామ వ్యవసాయ సహాయకులు వాసవి అన్నారు. వ్యవసాయశాఖ అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ఎం.వెంకటాపురం ఆర్‌బీకేలో శుక్రవారం వ్యవసాయ మండలి సమావేశం నిర్వహించారు. ఖరీఫ్‌కు సంబంధించి రైతుల అవసరాలను గుర్తించారు. ధాన్యం, మొక్కజొన్న, తదితర పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జి.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

గుర్ల: మండలంలోని జమ్ము రైతుభరోసా కేంద్రం వద్ద మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం ప్రారంభిస్తారని గ్రామ సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి శుక్రవారం తెలిపారు. మార్క్‌ఫెడ్ అధికారులు, జమ్ము సొసైటీ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. రైతులు దళారుల బారినపడి నష్టపోకుండా కొనుగోలు కేంద్రంలో పంట విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

దత్తిరాజేరు: మండలంలోని మరడాం పంచాయతీ మధుర గ్రామమైన మర్రివలస కొండ వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్లు కోమటిపల్లి ఏఈ ఆదిత్య శుక్రవారం తెలిపారు. ఇక్కడ ఉన్న 420 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటు మరో 200 ఎకరాల్లో మరో విద్యుత్ కేంద్రం నిర్మాణానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేసినట్టు చెప్పారు. జాతీయ రహదారి పక్కన భూమిని గుర్తించామని, నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఆయనతో పాటు మండల సర్వేయర్ సత్యం ఉన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

లక్కవరపుకోట/కొత్తవలస/వేపాడ: విద్యాహక్కు చట్టం కింద నిరుపేద, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఉచితంగా ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 6 నుంచి 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సీహెచ్ కూర్మారావు, జి.శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌టీఈ కింద ప్రైవేట్ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. మొదటి విడతలో దరఖాస్తు చేసుకున్న వారికి లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు పూర్తయిందన్నారు. రెండో విడత కింద ఈ నెల 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్/ఆర్‌టీఈ వెబ్‌సైట్‌లో, గ్రామ సచివాలయాల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

పేదల ఇళ్ల స్థలాలకు ప్రభుత్వ భూమిని గుర్తించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- నియోజకవర్గంలో 4వేల మందికి ఇళ్ల స్థలాలు
- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ: నియోజకవర్గం పరిధిలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని తహసీల్దార్ కృష్ణంరాజుకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఇళ స్థలాలు కావాలని చాలా మంది అడిగారని, నియోజకవర్గంలో నాలుగువేల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతీ మండలంలో ప్రభుత్వ భూమిని గుర్తించాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అలాగే గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం చాలావరకు చెల్లించిందన్నారు. భవనాల నిర్మాణం పూర్తిచేసి ప్రారంభోత్సవాలు చేపట్టాలన్నారు. ఎంపీడీఓ, పీఆర్ ఏఈలు భవన నిర్మాణాలను పరిశీలించి వారం వారం నివేదిక ఇవ్వాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయాల పరిధిలో గుర్తించిన పనులకు నెల రోజుల్లో బిల్లులు చెల్లించనున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు అడపా ఈశ్వరరావు, దాయిరి ముత్యాలమ్మ, జడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరీ, నెడ్‌క్యాప్ డైరెక్టరు పద్మావతి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ సన్యాసినాయుడు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం మండల చైర్మన్ రామ్మూర్తినాయుడు, తహసీల్దారు కృష్ణంరాజు, ఎంపీడీఓ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ



అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు

గుర్ల: మండలంలోని చోడవరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు సక్రమంగా పౌష్టికాహారం అందించకపోవడంపై గ్రామస్తులు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సూపర్‌వైజర్ శకుంతల శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. సర్పంచ్ తిరుమరెడ్డి పద్మావతి, గ్రామస్తులు నుంచి వివరాలు సేకరించారు. ఈ ఏడాది జనవరి నుంచి రికార్డుల నిర్వహణ సక్రమంగా లేదని గుర్తించారు. చిన్నారులకు నాణ్యమైనా పౌష్టికాహారం అందించడం లేదని తల్లిదండ్రులు ఐసీడీఎస్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. విచారణ జరుగుతున్న సమయంలో టీడీపీ నాయకులు రాంబాబు, రాజు అంగన్‌వాడీ కేంద్రం వద్ద గ్రామస్తులు, అధికారులతో వాగ్వాదం చేశారు.

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



లబ్ధిదారులకు సీఎం సందేశ పత్రాన్ని అందజేస్తున్న నాయకులు, అధికారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ గరివిడి మండల నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, స్థానిక సమస్యలపై ఆరా తీశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద, సామాన్య ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతుండడంతో వారంతా ఆనందంగా ఉన్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇలాంటి సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎప్పుడైనా అమలు జరిగాయా అని ప్రశ్నించారు. ప్రజా సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుడివాడ శ్రీరాములునాయుడు, అర్తమూరు సర్పంచ్ పొన్నాడ కుమార్, అలమండ అప్పలనాయుడు, స్థానిక నాయకులు గేదెల ఆదినారాయణ, గేదెల శంకరరావు, గవిడి సన్యాసి, గవిడి అప్పలనాయుడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మండలానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలు



పుస్తకాలు భద్రపరిచేందుకు తరగతి గదులను ఖాళీ చేయిస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, జగనన్న విద్యాకానుక కిట్లు మండలానికి వస్తున్నాయని ఎంఈఓ విమలమ్మ తెలిపారు. తొలివిడతలో మండలానికి వచ్చిన విద్యాకానుక కిట్లను స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 1 నుంచి10వ తరగతి వరకు సంబంధించి పాఠ్యపుస్తకాలు, 6 నుంచి 10వ తరగతి వరకు నోట్‌బుక్స్ వచ్చాయన్నారు. యూనిఫాం, షూ, బ్యాగ్‌లు, డిక్షనరీలు, బెల్టులు, సాక్స్‌లు రావాల్సి ఉందన్నారు.

ఆలయాల నిర్మాణంతో లోక కల్యాణం



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

లక్కవరపుకోట: గ్రామాల్లో ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తిభావం పెరిగి లోక కల్యాణం జరుగుతుందని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో రంగాపురం రోడ్డులో భోజింకివారి కళ్లాల వద్ద నందీశ్వర ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రుత్వికులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం రఘురాజు మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తి భావం, సోదర భావం, స్నేహ భావం పెరుగుతాయని, ఫలితంగా సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొంటాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భోజింకి గోవింద, భోజింకి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన

శృంగవరపుకోట: మండలంలో పెదఖండేపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం చుట్టూ ప్రహరీ పునర్నిర్మాణానికి ఎమ్మెల్సీ రఘురాజు శుక్రవారం భూమిపూజ చేశారు. ఆయనతో పాటు ఎంపీపీ సోమేశ్వరరావు, గ్రామ సర్పంచ్ యాళ్ల వెంకటరమణ, వైస్ సర్పంచ్ సూర్యనారాయణ, ఎంపీటీసీ బోదల దేముడు తదితరులు ఉన్నారు.

చిరుధాన్యాల సాగు పెంచాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రమేష్

గజపతినగరం రూరల్(మెంటాడ): మండలంలోని రైతులు చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి రమేష్ అన్నారు. మండలంలోని శ్రీరంగరాజపురం ఆర్‌బీకేలో నిర్వహించిన వ్యవసాయ సలహామండలి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్‌బీకేల ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుందన్నారు. రైతులకు ఖరీఫ్ సాగు యాజమాన్య పద్ధతులు, ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ ధనలక్ష్మి, సర్పంచ్ కామునాయుడు, వీఆర్వో సింహాచలం తదితరులు పాల్గొన్నారు.